# అద్దంలో మనం....

**బ**ల్లమీదనున్న వుత్తరాన్ని చదివిన మైసయ్య ఆందోళనగా మొహం పెట్టాడు. భారంగా నిట్టూర్చి కళ్లు మూసుకుని ఏదో ఆలోచిస్తూ గంభీరంగా వుండిపోయేడు.

సీతామహాలక్ష్మి రెండు కప్పులతో కాఫీ తెచ్చింది. వొకటి అతడి ముందుగా వుంచి, రెండో కప్పుతో ప్రక్కన ఉన్న మరో కుర్చీలో కూర్చుంది.

వుత్తరం వస్తే ఉత్సాహంగా సంగతులన్నీ ఏకరువూ పెట్టే మైసయ్య ఆ రోజు నిశ్శబ్దంగా, మౌనవ్రతాన్ని పుచ్చుకున్నట్లుగా కూర్చుండిపోవటం ఆమెకి చిత్రంగా అనిపించింది.

మైసయ్య గురించి చెప్పాలంటే ఎంతో వుంది.

అతడీరోజు తెల్లబట్టలేసుకుని, పంకా కింద కూర్చుని పదిమందితో పాటుగా వుద్యోగం వెలగబెడుతున్నాడూ అంటే– వెనకాల ఎంతోమంది రెక్కల కష్టం, ఎన్నో త్యాగాలు ఇంకెన్నో కష్టాలు, నష్టాలు, కుత్రంత్రాలు.... నిండుగా వున్నాయ్.

మైసయ్య తల్లితండ్రులు చదూకున్నవాళ్ళు కారు. అసలు చదూకోవటం అంటే ఏమిటో తెలీని వాళ్ళు భూముల్ని, రెక్కల్లో ఓపికని, ఎండని, వానని, కామందుల్ని, వాళ్ళ కనికరాల్ని నమ్ముకుని బ్రతకటం మాత్రం తెల్సినవాళ్లు. వూరికి, జనానికి దూరంగా పొలాలికి దగ్గరగా, మురుక్కాలవ పక్కగా, కొడికట్టిన దీపాల్లాగా, కదిలే శవాల్లాగా, కొన్ని కుటుంబాల్ని బాగు చెయ్యటానికి కూలీ అవతారం ఎత్తిన దేవుళ్ళలాగా...... రోజుల్ని నెట్టుకొస్తున్నారు.

ఇంగ్లీషు చదువు చదివి, నీరకాయపట్టిన పంచె, చెమటకంపు కొట్టే బనీను కాక, ప్యాంటూ, షర్టు తొడిగి, వూరు దాటి, ఏరుదాటి వుద్యోగానికొచ్చిన మొదటివాడు మైసయ్యే. ఆ కారణంగా వాళ్ళందరికి ఇతడంటే వల్లమాలిన ప్రేమే కాకుండా, గొప్ప ధైర్యం కూడాను దేవుడ్ని నమ్ముకున్న ఆస్థికుడు. ఎంత ధైర్యంగా వుంటాడో మైసయ్య మీద నమ్మకం వుంచి అంతకన్నా ఎక్కువ ధైర్యంగా వుంటారు. వూరి విశేషాలన్నిటిని వారం పదిరోజులకొకసారి ఏ కరణంగారమ్మాయి చేతనో, పెద్దపంతులు గార్ని చిన్నవాడిచేతనో వాళ్ళ పేర్న వ్రాయిస్తుంటారు.

మైసయ్య గూడా తక్కువాడేం కాడు. ఆ వుత్తరాన్ని దాంట్లో విశేషాలని, దాంట్లో తన వూరి రాజకీయాల గురించి మళ్లీ ఉత్తరం వచ్చే వరకు భార్యకి కథలు కథలుగా చెప్తుంటారు.

అలాంటి వాడు ఆరోజు ఉత్తరం చదివి మాటాపలుకూ లేకుండా కూర్చుండి పోవటం సీతామహాలక్ష్మికి ఆశ్చర్యం కలిగిటంలో అసహజత్వం ఏమీలేదు.

ఎంతసేపటికి అతడిలో మార్పు రాకపోయేసరికి, ఆమె "కాఫీ చల్లారిపోతుంది. తీసుకో' అంటూ అతడి ఆలోచన్లకి అడ్డుకట్ట వేసింది.

సాయంత్రపు చిరువెలుగు క్రమక్రమంగా మాయమయ్యి చీకట్లు వ్యాపిస్తున్నయ్. గాలి స్తంభించి వుక్కపెడుతోంది. గదిలో కొద్దిరోజుల క్రితమే వేయించిన సీలింగు ఫ్యాను మెత్తగా తిరుగుతూ వేడివేడి గాలిని సరఫరా చేస్తోంది.

మైసయ్య కాఫీ కప్పుని చేతిలోకి తీసుకుని, ఓ గుక్కతాగి, "అయ్యకి వొంట్లో బాగా లేదట. ఓ సారమ్మన్నారు" అన్నాడు.

మైసయ్య చదువుకున్నవాడు గనక. ఉద్యోగస్థుడు గనక, నాగరీకుడు గనక, ఆత్మవంచనల్ని అలవాటు చేసుకున్న వాడుగనక సాధారణంగా తండ్రిని ఫాదరనే ఇంగ్లీషు పదంతోనే గుర్తు చేసుకుంటుంటాడు. కాని కొన్ని కొన్ని సమయాల్లో ఆలోచన్లు, ఆత్మీయతలు, ఈ నాగరీకతల్ని, చదువుల్ని, హోదాల్ని, ఈ మనుషుల్ని దాటి పైకి వెళ్ళినపుడు గుండె పొదల్లో మనసు మడతల్లో తండ్రి కదిలి, 'మైసీయా' అంటూ ఆర్తిగా పిల్చినప్పుడు 'అయ్య'నే అంటాడు.

మైసయ్య ఇంకోగుక్క కాఫీ తాగి భార్యవైపుగా చూసేడు. ఆమెలో మార్పు లేదు. చలనం లేదు. తను చెప్పిన సంగతి వినినట్లుగా ధాఖలాల్లేవు.

అంచేత మళ్ళీ చెప్పాడు– పైగా "నిన్నుగూడా తీస్కరమ్మని రాసేరు. వెళ్ళి ఓసారి చూసొస్తే" అని గూడా అన్నాడు.

కొత్త ఫ్యానువంక ముచ్చటగా చూస్తున్న సీతామహాలక్ష్మి ఆ మాటతో మౌనాన్ని భళ్ళున బద్దలు కొట్టింది.

"నేను మాత్రం రాను. ఆ పాక, ఆ మురుగు, ఆ మనుషులు, ఆ దోమలు, ఓ మైగాడ్" అవన్నీ కళ్ళముందు దర్శనం ఇచ్చాయి కాబోలు గట్టిగా భయపడుతున్నట్లు కళ్ళు మూసుకుని "నువ్వెళ్ళి మీ ఫాదర్ని పరామర్శించిరా– అంతేగాని నేను మాత్రం–"

మైసయ్య ఆమె మాటలు పూర్తికాకుండానే రెచ్చిపోయి, గయ్‌మన్నాడు. "నువ్వు నావైఫ్‌వి– పెద్దింట్లో పుట్టుండచ్చు కాని నా వైఫ్‌వి గనక నాతోపాటు వుండాలి. నువు రాకపోతే అమ్మ, బావలు ఏవిటనుకుంటారు? మా ఫాదర్ ఎంత ఫీలవుతాడు? జస్ట్ థింక్ ఓవరిట్– అంచేత తప్పదు ఈ వొక్క సారికి"

సీతామహాలక్ష్మి రెచ్చిపోవటంలోను, గయ్‌మనంటంలోనూ అతడి కేమాత్రం తీసిపోలేదు.

"నేనిష్టపడింది, చూసింది, పెళ్ళి చేసుకున్నదీ నిన్ను. నీవరకు నేనన్నిటిని భరిస్తాను. కాని మీ వాళ్ళ మెహర్బానీ కోసమో ఆనందం కోసమో ఆ గుడిసెల్లో వుండి, ఆ మురుక్కంపు పీల్చుకుంటూ, ఆ తిళ్ళుతింటూ, వుండటం నా వల్లకాని పని. అలా వుంటానని పెళ్ళికి ముందు నీకు వాగ్దానం ఏదీ చెయ్యలేదు. వాళ్లలా బ్రతకటం తప్పనిగాని, వాళ్ళు మనుషులు కారనిగాని నేనెప్పుడూ అన్లేదు– అనను గూడా. అలాగే భర్తకోసం భార్య ఏదైనా చెయ్యాలి. అడవుల్లోనైనా వుండాలి. వగైరా సిద్ధాంతాల్లో గూడా నాకుకించిత్తు నమ్మకం గాని, గౌరవంగాని లేవని నీక్కూడా తెల్సు!"

మైసయ్యకి మొహం ఎర్రబడింది. కోపంతో వొళ్ళు సలసల్లాడింది. అయినా తమాయించుకొనే ప్రయత్నంలో కష్టపడి చిరునవ్వు నవ్వి, కుర్చీని ఆమెకి దగ్గరగా జరుపుకుని, ఆమె చేతిని చేతుల్లోకి తీసుకు నిమరుతూ– "సీతా– పెళ్ళికి పూర్వం

ఇవన్నీ మనం మాట్లాడుకోని వాట వాస్తవమే. కాదనటం లేదు. కాని భర్తతోటే భార్య, అత్తమావలంటే దైవసమానులని శాస్త్రాలు వ్రాసి, వల్లించే  ఇంట్లోంచి వచ్చినదానికి నేనేం చెప్పేది! నా అయ్య నా అమ్మ– నా వాళ్ళంతా మనుషులు కారా? నిన్నేం వాళ్ళు కొడతారా? పీక్కుతింటారా? రెండ్రోజులు అక్కడుంటే మైలపడిపోతావా? ఆలోచించు. అన్ని సక్రమంగా వుంటే వెంటనే వచ్చేద్దాం."

ఆమె తన చేతిని విసురుగా వెనక్కి తీసేసుకుని, కళ్ళు, మొహం ఎరుపు చేసుకుని ఆవేశంగా అన్నది. "నువ్వేమాట్లాడుతున్నావో అర్థం కాకుండా ఉంది. మతాలు, కులాలు వీటన్నిటిలో నిజంగా నాకు నమ్మకంగాని వుంటే అసలు మన పెళ్ళే జరిగుండేదికాదు. కాబట్టి వాటిని గూర్చిన తర్కం అనవసరం మీ ఫాదరికి ఒంట్లో బాగుండలేదు కాబట్టి చూడాలనుండటం సహజం– చూసిరావటం ధర్మం. కాని నన్ను గూడా రమ్మని వొత్తిడి చెయ్యటం, నాకు ఇష్టం లేని పనిని నాచేత చేయించాలని చూడటం నాకు నచ్చదు. అది నేను సహించలేను. కావాలంటే టి.వీ. కొనటం కోసం బ్యాంకులో దాచుకున్న డబ్బు డ్రా చేసిస్తా తీసికెళ్లి మంచి వైద్యం చేయించు అంతేగాని నేమాత్రం రాను. అంతే!"

సీతామహాలక్ష్మి కాఫీ కప్పులు పుచ్చుకుని వంటగదివైపుగా వెళ్ళిపోయింది.

మైసయ్య ఆమె వెళ్ళినవైపే చూస్తూ వుండిపోయేడు. అతడిలో ఏవేవో భయాలు, సందేహాలు....ఈమెని కట్టుకోవాలన్న తన నిర్ణయం తొందరపాటు చర్యకాదు గదా? నిజంగా తనని ప్రేమించిందా? లేక తన ఉద్యోగం, హోదా, ప్రమోషన్లు....వీటన్నిటిని చూసి పథకం ప్రకారం....చాలా విషయాల గురించి ఆలోచిస్తూ దిగాలుగా, దిగులుగా, వొంటరిగా కూర్చుండిపోయేడు.

మైసయ్య ఆమెని మొదటిసారిగా బేంకులోనే చూసేడు.

ఆ రోజునే ఆమె సర్వీసులో చేరింది. బిక్కు బిక్కు మంటూ కూర్చునుంది. అప్పుడు మొదటిసారిగా చూసేడు. సన్నగా ఎర్రగావుంది. సూటిముక్కు, చిన్నకళ్ళు, పల్చని పెదాలు, నవ్వుతున్నప్పుడు గుంటలుపడే లావుబుగ్గలు– ఆ చూపుల్లే, ఆమొహంలో, ఆమాటలో ఆ తీరులో మైసయ్యకేదో ఆకర్షణ కనిపించింది. అధిక ప్రసంగం, అనవసర విషయాల్లో జోక్యం చేసుకోవటం గాని లేక తనపని తను తలొంచుకు చేసుకుపోయే పద్ధతి గూడా అతడ్ని ఆకర్షించింది.

ఆమె చేరిన ఆర్నెల్లకే మైసయ్యకి ప్రమోషనొచ్చింది. జీతం పెరిగింది, హోదా పెరిగింది. వేషభాషల్లోను అలవాట్లలోను ఎంతో మార్పొచ్చింది.

ఇపుడు మైసయ్య ఇస్త్రీ చేసిన బట్టల్ని రోజుకోటి మారుస్తున్నాడు. అరగంటకోసారి టాయ్‌లెట్ కెళ్ళి మొహంతుడుచుకుని పౌడరద్దుకొస్తున్నాడు. గట్టిగా గాలి వీస్తే వెంటనే జేబులోంచి దువ్వెన తీసి పరపరా తల దువ్వేస్తున్నాడు. ఇవన్నీ ఎవర్నో ఆకర్షించాలని చేసేవికావు. అలా వుండటంలో అతడికి ఎంతో హాయి కనిపించింది. అలవాటుగా మారింది.

సీతామహాలక్ష్మి పన్లో ఏదన్నా అనుమానం వస్తే అతడ్నే అడిగేది. చాలా ఓపిగ్గా, సహనంగా విడమర్చి చెప్పేవాడు. దగ్గరుండి చేయించేవాడు మిగతా స్టాఫ్ వీళ్ళిద్దరి గురించి చెవులు కొరుక్కోవటం వరకు వెళ్ళింది. లంచ్ సమయంలో ఆమె అతడ్ని ఆహ్వానించటం, తను తెచ్చుకున్న కారం మెతుకులు స్టీలు మూతలో వేసి ఇవ్వటం, అతడేమో తన రొట్టెల్లో ఒకటో రెండో ఆమెకివ్వటం.... సినిమాల గురించో క్రికెట్ గురించో కబుర్లాడుకుంటూ తినటం... అక్కడ వాళ్ళకి రోజూ కనబడే దృశ్యం.

ఇంకో ఆర్నెల్లు గడిచేసరికి వాళ్ళిద్దరూ వివాహం చేసుకోబోతున్నారన్న వార్త బేంక్ కౌంటర్లపైన వినిపించాయి. వాళ్ళని సూటిగా అడగలేక, అలాగని వూరుకునుండలేక, సహోద్యోగులంతా సతమతమైపోతుండగా ఒకరోజు వాళ్ళందరికి కూల్ డింగ్స్ ఇచ్చి మరీ చెప్పారు . తాము ఒకటి కాబోతున్నట్లు వారంతిరక్కుండా వాళ్ళకి వివాహం జరిగింది.

మైసయ్య తాలూకు వాళ్ళంతా వచ్చేరుగాని, సీతామహాలక్ష్మికి స్నేహితురాళ్ళే అన్నీ అయ్యారు.

రెండుగదుల ఇల్లు తీసుకుని కాపురం పెట్టేరు. కావాల్సిన సామాన్లన్ని కొనుక్కున్నారు. వున్నంతలో ఇంటిని అందంగా తీర్చిదిద్దింది.

సహజీవనం మొదలయ్యాక వాళ్ళిద్దరికి వొకళ్ళని గురించి ఇంకొకళ్ళకి ఎన్నో విషయాలు తెలిసొచ్చేయ్.

ప్రతి శుక్రవారం తలారా స్నానం చెయ్యటం, తలకి ముడివేసుకుని కాళ్ల కింత పసుపు రాసుకోవటం, గుమ్మాలు కడిగి బొట్లు పెట్టటం, పూజ పునస్కారం, పర్వదినాల్లో ఉపవాసాలు, వ్రతాలు పండగొస్తే హైరాణాపడి పోవటం.

"నీకు చాదస్తం చాలా వుందే" అనే వాడు మైసయ్య మాటవరసకి–

"చాదస్తంకాదు, నమ్మకం. ఇదంతా నీకోసమేగా. నువ్వింకా పైకిరావాలని ....ఎన్నో సాధించాలని– " అనేది అతడి చేతుల్లో వాలిపోతూ.

మైసయ్య మరి మాట్లాడేవాడు కాడు.

అతడి అలవాట్లలో గూడా ఎన్నో మార్పులు తీసుకొచ్చింది. శుచీ శుభ్రం నేర్పింది. పాతికసార్లు తల దువ్వి, అరడజనుసార్లు మొహం కడుగుతే చాలదని, రెండు పూటలా స్నానం చెయ్యాలని, బనీను, లుంగీ ప్రతిరోజూ మార్చాలని, అందర్నీ నడిపే అతీత శక్తికి రెండు క్షణాలు తలొంచి ప్రణామం చెయ్యాలని, భోజనం వంట గదిలో మాత్రమే చెయ్యాలిగానీ, పడగ్గదిలోనో వీధి గుమ్మంలో కూర్చునో కాదని, కాళ్ళకి చెప్పులతో ఇల్లంతా తిరక్కూడదని.

మైసయ్యలో వుండి వుండి పౌరుషం తన్నుకొచ్చేది. "ఓ జంధ్యప్పోగు గూడాపడెయ్యి తెల్సొంటుంది" అనేవాడు కసిగా.

సీతామహాలక్ష్మి నవ్వేది.

"చాల్లే వూరుకో. ఇలా వుండటంలో నీకేవన్నా ఇబ్బందిగా వుందా? నామర్ధాగా వుందా? ఆరోగ్యపు సూత్రాలకి, కులాలకి సంబంధం లేదు. ఇవన్నీ ఓ కులంవాళ్ళు ఆచరిస్తారు. కాబట్టి మనం చెయ్యకూడదన్న వాదం సరయినది కాదు. మంచి ఎక్కడున్నా గ్రహించాలి. చెడులని గర్హించాలని మనల్ని చూసి పిల్లలు నేర్చుకుంటారు. చేసే వృత్తిని బట్టి కులం వచ్చింది. కాని ఈ వృత్తి వీరే చెయ్యాలన్న నిబద్ధత ఎక్కడుంది ఇప్పుడు మనిద్దరిది ఒకే కులం– 'కార్మి'కులం" అంటూ నవ్వేది.

ఆమె వాదం విని మైసయ్య అయిసయ్యి పోయేవాడు. కాని తనతోపాటు తండ్రిని చూట్టానికి రానంటే రానని మొండికెత్తినపుడు మాత్రం అతడు సరిపెట్టుకోలేక పోయేడు. ఆమె అసలు రూపు బయటపడ్డట్టుగా భావించేడు. వెనక్కి తిరిగి చూసుకుంటే ఆరోగ్యం పేరిట వాళ్ళ ఆచారాలు, అలవాట్లు తన చేత ఎంత తెలివిగా ఆచరింప చేయించిందో తెలిసొచ్చింది.

తనకి బుద్ధీ, జ్ఞానం లేదని తిట్టుకున్నాడు.

వుత్తరం వచ్చిన రెండ్రోజులు వాళ్లిద్దరికి మాటలు కరువైనాయ్. మైసయ్య పలకరిస్తే మండిపడుతున్నాడు.

మూడరోజున వారంరోజులు సెలవు పెట్టి తండ్రిని చూసిరావటానికి వాళ్ళ వూరు ప్రయాణమై వెళ్ళాడు. వెడుతూ తిరొగొచ్చిన దగ్గర్నించి పాతమైనయ్యగా మారిపోవాలని గట్టిగా అనుకుని మరీ బస్సెక్కాడు.

నీ నీ నీ

విజయవాడలో దిగేసరికి తెలతెలవారుతోంది.

అక్కడ్నించి సుమారుగా ముప్పై మైళ్ళ దూరంలో వుంది వాళ్ళ వూరు. మైసయ్య చదువుకునే రోజుల్లో ఒకటీరా బస్సులుండేవి. కాని ఇప్పుడలా కాదు. ఆ వూరి కుర్రకారుకి పట్టణ జీవితంపైన, సినిమాల పైన మోజు పెరిగింది. రద్దీ పెరగటం చేత బస్సులు కూడా పెరిగాయి.

కాఫీ టిఫిన్ పూర్తి చేసుకుని వాళ్ళ వూరెళ్ళే బస్సెక్కి కూర్చున్నాడు.

సరిగ్గా ఎనిమిది గంటలకి అతడ్ని వాళ్ళవూరి శివార్లలో దింపేసి బస్సు ముందుకెళ్ళి పోయింది.

మైసయ్య బ్రీఫ్‌కేసుని చేత్తో పుచ్చుకుని అలాగే నిలబడిపోయి కనిపిస్తున్న వూరివంక తదేకంగా చూసేడు.

దూరాన్నించే మార్పు కొట్టొచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. పాకలు పాకలుగానే వున్నాయ్. కాని వాటి మధ్యనించి మేడలు లేచి నిల్చున్నాయ్. వాటినెత్తిమీద నెమలిఫించాల్లాగా పొడుగాటి టీవీ యాంటీనాలు.

వూరి బయటవాళ్ళ పాకని చేరుకోవాలంటే పొలాల్లోంచి వెడితే అరగంట సేపు నడక. వూరి మధ్యనించి వెళ్ళాలంటే దాదాపు గంట పడుతుంది. మైసయ్యకి అడ్డదారే అలవాటు. కాని ఈసారి ఎందువల్లనో గాని వూరి మధ్య నుంచే వెళ్లాలనుకున్నాడు.

వూళ్ళోకి ప్రవేశించాడు.

డాబుగా, దర్పంగా, హుందాగా, ధైర్యంగా తలెత్తుకుని వీధుల గుండా నడుచుకుంటూ వెడుతున్నాడు.

డాబాల్లోంచి, పెంకుటిళ్ళలోంచి, పాకల్లోంచి జనం అతడి వంక ఆశ్చర్యంగా నోరెళ్ళబెట్టి చూస్తున్నారు.

మైసయ్య అందర్నీ ఓ కంట గమనిస్తూనే వూరి చివరకొచ్చేడు.

దూరంగా పాకలు... విసిరేసినట్లు.... మధ్యలో రెండు వైపులా పచ్చటి పొలాలు. మధ్యనించి కాలిబాట....

అతడు పొలాల వంక, పన్చేస్తున్న వాళ్ళవంక చూసుకుంటూ నడుస్తున్నాడు.

దూరాన్నించి ఎవరో ఆడమనిషి ఎవర్నో పేరుపెట్టి సంగీతం పాడుతున్నట్లు పిలుస్తోంది. చెట్లమీద కాకులు గోలగా అరుస్తున్నయ్. పొలానికెడుతున్న ఎద్దుల మెళ్ళో గంటలు రాగం తాళం తెలిసినట్లు మనోహరంగా మ్రోగుతున్నాయ్. పాకల్లోంచి పైకి లేస్తున్న పొగ, మంచుతెరలా వ్యాపిస్తోంది. పిల్లలు వొంటి పైన నూలుపోగైనా లేకుండా మురుక్కాలవ ప్రక్కనా ఆడుకుంటున్నారు.

మురుక్కాలవలో ప్రవాహం ఏమాత్రం తగ్గలేదు. పైగా పెరిగింది. వాసన, కుళ్లూ గూడా ఏమాత్రం తగ్గలేదు. పైగా పెరిగినాయ్. దానిపైన కర్రల వంతెన మాత్రం అలాగే వుంది. ఈ జనాన్ని, ఈ కుళ్ళుని కంపుని ఇంకెన్నాళ్ళు భరించాలాని బాధపడుతున్నట్లు ముసలదయ్యి మూలుగుతోంది. వంతెన ప్రక్కగుడి సెలూ ఎండిపోయి అలాగే వున్నాయ్. గుడిసెల్లో మనుషులూ వాటిలాగే ఎండిపోయి, ఇంకిపోయి చితికిపోయి కనిపిస్తున్నారు.

మైసయ్య వంతెన దాటేడు.

గుడిసెలమధ్యనించి నడుచుకొంటూ వెళ్ళి వెళ్ళి ఓ గుడిసెముందు ఆగేడు. ప్రక్క పాకముందు సీతారత్నం కూర్చునుంది. వొళ్ళో తెల్లగుడ్డ పరచుకుని తలని పేల దువ్వెన్న పెట్టి బురుక్కుంటోంది. పైటజారిపోయి ఎదురొమ్ములు గుండ్రంగా, ఎత్తుగా జాకెట్టుని తెంచుకుని బయటపడేలా వున్నాయ్.

ఆమె తలెత్తి మైసయ్యవంక చూసింది.

"నువ్వా- ఇదేనా రావటం పలకరించింది.

మైసయ్య జవాబుగా నవ్వేడు.

అతడు చదువుకునే రోజుల్లో సీతారత్నం పెళ్ళి చేసుకుని ఆ పాకలోకొచ్చింది. మొగుడుపట్నంలో ఫ్యాక్టరీలో కూలీ. తిన్నగా ఇంటికొచ్చేవాడు కాదు. అప్పట్లోనే ఆమె ఒకటి రెండు సార్లు మైసయ్యని చూసి కన్నుగీటి వొళ్ళు విరుచుకుంది. మైసయ్యలో వుత్సాహం, ప్రోత్సాహం కనిపించక పోవటంతో మళ్ళీ ప్రయత్నించిందికాదు. దానికి విజయవాడలో పరిచయాలు పన్లూ ఎక్కువ. ప్రతిరోజూ వెళ్ళొస్తుంటుంది. దానికోసం అప్పుడప్పుడూ కార్లుకూడా వచ్చి కర్రల వంతెన ప్రక్కగా ఆగుతాయని ప్రతీతి. అది ఎండిపోయిన ఆ జనం మధ్యన ఎరువుతిన్న మనిషిలా గలగలా గునగునా తిరిగేది. వొళ్ళుగాని, పొంగుగాని తగ్గలేదుగానీ ఉత్సాహం తగ్గింది. మొహండాగులుపడింది. జుట్టు ప్రక్కల్నించి నెరుస్తోంది.

మైసయ్యవొంగి తనపాకలో కెళ్ళేడు. పాకమధ్యగా ఓకుక్కి మంచమేస్తుంది. దాంట్లో చిక్కి శల్యమైపోయిన వృద్ధుడొకడు స్పృహ తెలీకుండా పడున్నాడు. అతడి గొంతులోంచి మూలుగులాంటి శబ్దం భీకరంగా వినిపిస్తోంది. కళ్ళు మూతలుపడిపోయేయి. పుట్టుకకి, చావుకి మధ్య జరిగే జగన్నాటకాన్ని అర్థం చేసుకున్నట్లుగా మొహం ప్రశాంతంగా వుంది. నల్ల చర్మంపై ఏపుగా పెరిగిన తెల్లటిగడ్డం వెండి అద్దకం చేసినట్లుంది.

మైసయ్య వొంగి అయ్యని పరీక్షగా చూసేడు.

ఎండనకా, వాననకా, రాత్రిపగలనకా పొలాల్లోపడి గొడ్డులా పన్చేసి, పంట పుష్కలంగా పండితే వెర్రిగా ఆనందపడిపోయి, వర్షాల్లేకపోతే పొలం మధ్యగా నిల్చుని, ఆకాశంకేసి చూస్తూ వెక్కి వెక్కి ఎడ్చి- తన కండల్ని, తన శక్తిని, తన బ్రతుకునే ఆ పొలానికి నైవేద్యం పెట్టి కామందుల కల్పవృక్షం అనిపించుకున్న అతడు బక్కచిక్కి, వోపికనశించి, కండలు నీళ్ళయి కడపటి యాత్రకు వెళ్ళిపోతుంటే దగ్గరుండి సాగనంపే ఓపిక, సహనం, సంస్కారం ఎవ్వరికి లేనట్లు ఒంటరిగా పడున్నాడు మైసయ్య కళ్ళు బాధతో ఎర్రబడ్డాయి.

జేబులోంచి ఇస్త్రీ కర్చీఫ్ కళ్ళద్దుకోవాలని తీసేడు.

కాని అది కళ్ళవరకు వెళ్ళలేదు. ముక్కు వద్దనే ఆగిపోయింది. మురుక్కంపుని అడ్డుకుంటూ.

నీ నీ నీ

రాత్రి పదిగంటలయింది.

మైసయ్య దొడ్లో వేపచెట్టు క్రింది శిథిలావస్థలో వున్న నులకమంచంలో పడుకున్నాడు. ప్రక్కనే మురుక్కాలువ గల గల మంటూ జీవనదిలా ప్రవహిస్తోంది. మురుగుకంపు గుప్పుగుప్పున వీస్తోంది. దోమలు జుమ్మని సంగీతం అలాపిస్తూ అతడ్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయ్.

మైసయ్య లేచి కూర్చున్నాడు.

ఎక్కడోకుక్కలు పోటీలుపడి మొరుగుతున్నాయ్. దూరాన్నించి డప్పుల మోత వినిపిస్తోంది. ప్రక్క పాకలో సీతారత్నం సారా తాగి అర్థం తెలీని హిందీ పాటని అందరికీ అర్థమయ్యేలా పెద్దగా పాడుతోంది.

అతడికేమిటో అసహనంగా వున్నట్లనిపించింది. తెల్లవారే వరకు ఈ కంపు, ఈ దోమల మధ్యగాని వుండి, ఏ కలరానో, బ్రెయిన్ ఫీవరో వచ్చి, తండ్రితో పాటే తనుగూడా...

ఆలోచించలేకపోయాడు.

ఇదే వూళ్ళో, ఇదేపాకలో, ఈమురుగుకాలవ పక్కగా, ఈ దోమల మధ్యన ఈ మనుషుల్తో, ఈ తిండి తింటూ కొన్ని సంవత్సరాల పాటు గడిపానన్న కఠినమైన నిజం అతడికాక్షణంలో గుర్తుకు రాలేదు.

మంచంలోంచి లేచి పాకలోపలికొచ్చాడు.

తల్లి నేలపైని పడుకుని పెద్దగా గురకపెడుతూ నిద్రపోతోంది. గుమ్మానికవతలగా సారా తాగొచ్చి బావయ్య వొళ్ళు తెలీని స్థితిలో వున్నాడు.

అతడు చకచకా ప్యాంటు షర్టు వేసుకున్నాడు. అలికిడికి తల్లిలేచింది. "ఏరా అయ్యా. నీళ్లకావాలనా"

"లేదు...రేపు విజయవాడలో స్నేహితుడి లగ్గం వుంది. అది చూసుకుని మళ్ళీవస్తా"

ఆమె ఏదో గొణుక్కుంటూ ఇంకో వైపు తిరిగి పడుకుంది.

అతడు తండ్రి వంక పరీక్షగా చూసేడు. పరిస్థితిలో పెద్దమార్పు లేదు.

పర్సులోంచి కొంత డబ్బు తీసి తండ్రి తల కిందగా వుంచి పెట్టే పట్టుకుని బయటికొచ్చేడు. వడివడిగా నడుస్తూ కర్రలవంతెన దాటి చీకట్లో కలిసిపోయేడు.

విజయవాడలో అధునాతనమైన హోటల్లో రూము తీసుకున్నాడు. శుభ్రంగా స్నానంచేసి ఇస్త్రీ లుంగీకట్టేడు తలనిసాపుగా దువ్వి కడుపునిండుగా నీళ్ళు తాగేడు– లైటు తీసేసి కిటికి ప్రక్కగా వున్న ఫోం పరుపు మీదపడుకున్నాడు.

చల్లటిగాలి తెరలుతెరలుగా వస్తుంటే హాయిగా వుందనిపించింది.

జరిగిందంతా తల్చుకుంటే మైసయ్యకి తొందరపడ్డానా అనిపించింది. గిల్టీగా ఫీలయ్యేడు. పుట్టినవూరు పెరిగిన వాతావరణం, తనవాళ్లు, వీటన్నిటికి దూరంగా పారిపోయిరావటం ఎంతవరకు న్యాయం? ఎవరేదో చేస్తున్నారని వీళ్ళని పనిగట్టుకుని దూరంగా వుంచేస్తున్నారని నమ్మే తను చేసిందేవిటి? ఇప్పుడు తను తనవాళ్ళల్లో వొకడుకాడు. వాళ్ళల్లో వొకడు నగరజీవితాలకి, సుఖాలకి బాగా అలవాటు పడిపోయిన తనుతనవాళ్ళ స్థితిని మెరుగుపర్చటానికేంచేసేడు?

మైసయ్య ఆలోచనల్లోకి సీతామహాలక్ష్మి వచ్చింది.

కాని చిత్రంగా ఇప్పుడామెపైన కోపం రాలేదు. ఆమె గురించి ఆలోచిస్తూ, ఆమె విరహంలో కాగిపోతూ కాలిపోతూ మెల్లమెల్లగా నిద్రలోకి జారిపోయేడు.

నీ నీ నీ